క్లుప్తంగా

డెప్యూటీ తహసీల్దార్‌గా స్రవంతి



మాచవరం: మాచవరం డెప్యూటీ తహసీల్దారుగా ఎం.కె.ఎస్.స్రవంతి నియమితులయ్యారు. జిల్లా ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు కారెంపూడి మండలంలో డీటీగా పనిచేస్తూ ఆమె మాచవరం బదిలీ అయ్యారు. సోమవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఆమెకు అభినందనలు తెలియజేశారు.

స్వాములకు సద్ది ప్రారంభం

గురజాల: అయ్యప్ప స్వామి దేవస్థానం ట్రస్టు ఆధ్వర్యంలో స్వామి మాలధారులకు సద్ది కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. స్థానిక గంగా పార్వతీ సమేత ముక్కంటేశ్వర స్వామి దేవస్థానంలో వివిధ మాలలు ధరించిన స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్తీక మాసం నుంచి నూతనంగా నిర్మాణం జరుగుతున్న శ్రీ అయ్యప్ప స్వామి వారి దేవాలయం వద్ద సద్ది కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

వృద్ధులకు ఆర్థిక సాయం

దాచేపల్లి : స్థానిక ఏలియంపేట కాలనీలో నివాసం ఉంటున్న వృద్ధ దంపతులకు వారధి ఫౌండేషన్ సభ్యులు సోమవారం ఆర్థికసాయం అందజేశారు. కాలనీకి చెందిన దైద ఏసయ్య దంపతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వీరికి మందుల కోసం ఫౌండేషన్ సభ్యులు ఉదయ ధీరజ్ ఇచ్చిన రూ.7వేల నగదుని ఫౌండేషన్ వ్యవస్థాపకులు తగరం ఆనంద్‌కుమార్, సభ్యులు వట్టెపు నాగేశ్వరరావు చేతుల మీదుగా అందించారు.

విద్యార్థికి ఆర్థిక సాయం



పిడుగురాళ్ల: రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ వారి సహకారంతో ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ 2వ సంవత్సరం చదువుతున్న పిడుగురాళ్లకు చెందిన విద్యార్థిని నల్లబోతుల నికితకు ఫీజు నిమిత్తం రూ.1.50 లక్షల ఆర్థిక సహాయాన్ని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో సోమవారం అందించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు హాజరై విద్యార్థినికి సాయం అందించారు. రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ అధ్యక్షులు గుండా అశోక్ బాబు ఆధ్వర్యంలో కొత్త సాయి కృష్ణ, డాక్టర్ యక్కల నరేష్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో సెక్రటరీ నీరుమళ్ల రాజేష్, ట్రెజరర్ గుర్రం కృష్ణకాంత్, రోటరీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓకు సత్కారం



క్రోసూరు. సత్తెనపల్లి ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన రమణకాంత్ రెడ్డిని సోమవారం జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గార్లపాటిదాసు, యాసారపు బాబు, సత్తనపల్లి డివిజన్ సభ్యులు వేల్పుల అఖిల్ కలుసుకున్నారు. అనంతరం గార్లపాటి దాసు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలకు చెందిన భూములు, ఇంటి నివేశ స్థలాలు వివాదాలు న్నాయన్నారు. క్రోసూరు ఎస్సీ కాలనీలోని సర్వే నంబరు 552లో దుగ్గి మరియమ్మ, చిలకా మరియమ్మకు చెందిన నకిలీ ఇంటి నివేశ స్థల పట్టాలపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు.

పిచ్చి కుక్కల పట్టివేత

నకరికల్లు: పిచ్చి కుక్కల బారి నుంచి రక్షణ కల్పించేందుకు సత్వర చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి కె.వి.ఎస్ ప్రసాద్ అన్నారు. స్థానిక సినిమా హాలు బజారులో పిచ్చికుక్కలు ఇద్దరిని గాయపరిచాయి. ఈ మేరకు స్థానిక సచివాలయంలో ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్యదర్శి ప్రసాద్ కుక్కలను పట్టించారు. చిలకలూరిపేట నుంచి కుక్కలను పట్టుకునే వారిని పిలిపించామన్నారు. భయాందోళనలకు గురికావద్దని స్థానికులకు ధైర్యం చెప్పారు.

ఘనంగా చండీ హోమం



పెదకూరపాడు: 75 తాళ్లూరులో సోమవారం చండీ హోమం నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఐదోరోజు అమ్మవారిని చండీ దేవిగా అలంకరించారు. 13 అనువాకాలతో హోమం నిర్వహించి, పూర్ణాహుతి చేశారు. సాయి సుబ్రహ్మణ్య రాఘవశర్మ, బసవరాజు సుబ్రమణ్య శర్మ హోమం క్రతువు నిర్వహించారు. ఆలయ పూజారులు హనుమంతరావు శర్మ, హరినాథ శర్మ భక్తులకు చండీ విశిష్టతను వివరించారు.

తరగతిలేక!

లెనిన్ నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో దుస్థితి

- 360 మంది విద్యార్థులకు నాలుగే తరగతి గదులు
- విద్యార్థులతో కిక్కిరిసిన గదులు
- కింద కూర్చునే విద్యాభ్యాసం
- మధ్యలో ఆగిన పాఠశాల కొత్త భవన నిర్మాణం
- అవస్థలు పడుతున్న విద్యార్థులు



కింద కూర్చుని చదువుకుంటున్న విద్యార్థులు

పిడుగురాళ్ల: స్థానిక లెనిన్ నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాలను తరగతి గదుల కొరత వేధిస్తోంది. ఇక్కడ సుమారు 360 మంది విద్యార్థులు ఉంటే తరగతి గదులు నాలుగే ఉన్నాయి. ఒక్కో తరగతి గదికి 40 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని అధికారులు చెబుతున్నా.. అంతకంటే రెట్టింపు మంది కిక్కిరిసి విద్యాభ్యాసం సాగించాల్సిన దుస్థితి నెలకొంది. తరగతి గదులు సరిపోకపోవడంతో కొందరు విద్యార్థులు వరండాలో నేలపైనే కూర్చుని చదువుకుంటున్నారు. ఈ పాఠశాలలో పేద, మధ్యతరగతి విద్యార్థులే ఎక్కువ. బడిలో కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు కూడా సక్రమంగా లేకపోవటంతో విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. వాటర్ ప్లాంట్ ఉన్నా.. పాడైపోవడంతో బోరు నీరు తాగాల్సిన దుస్థితి నెలకొంది. బెంచీలు లేక కింద కూర్చుని చదువుతున్నారు.

ఆగిపోయిన కొత్త భవన నిర్మాణం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో మనబడి నాడు–నేడు పథకం ద్వారా లెనిన్ నగర్‌లో స్థలాన్ని కేటాయించి రూ.కోట్ల రూపాయలు వెచ్చించి 2023–24 విద్యా సంవత్సరానికి హైస్కూల్‌కు కొత్త భవనం సమకూర్చాలనే లక్ష్యంతో నిర్మాణ పనులను వేగవంతం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఈ భవనం నిర్మాణ పనులు ఆగిపోయాయి. దీంతో విద్యార్థులు చాలీచాలని తరగతి గదుల్లో ఇరుకుగా కూర్చొని చదవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆగిపోయిన భవన నిర్మాణ పనులను పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు.



పిడుగురాళ్ల పట్టణంలోని లెనిన్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



మధ్యలోనే ఆగిపోయిన లెనిన్ నగర్ హైస్కూల్ నూతన భవన నిర్మాణం

వార్డుమెంబర్ల శిక్షణ ప్రారంభం

కారెంపూడి: మండలంలోని 15 గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రారంభమైంది. గ్రామ పంచాయతీల విధులు, గ్రామ ప్రజలకు పంచాయతీలు కల్పించాల్సిన మౌలిక వసతులు తదితర అంశాలను వివరించారు. ఇంటి పన్నులు ఎలా విధించాలి, పంచాయతీ ఆస్తుల పరిరక్షణ, తాగు నీటి వనరుల పరిరక్షణ తదితరు అంశాలపై అధికారులు గ్రామ ప్రజా ప్రతినిధులకు వివరించారు. కోర్సు డైరెక్టర్లుగా ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్డీ సత్యప్రసాద్‌లు, టీఓటీలుగా కసిన్యానాయక్, రవీంద్రబాబు వ్యవహరించారు.



శిక్షణలో మాట్లాడుతున్న టీఓటీ రవీంద్రబాబు, పక్కన ఈఓపీఆర్డీ సత్యప్రసాద్, కసిన్యానాయక్

9న ఉప సర్పంచ్, వార్డు మెంబర్లకు శిక్షణ

మాచవరం: రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 9, 10వ తేదీల్లో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి ఎంపికైన ఉప సర్పంచ్, వార్డు మెంబర్లకు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఒక్కో గ్రామం నుంచి ఉప సర్పంచ్, ఒక పురుష, ఒక మహిళా వార్డు మెంబర్లు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. గ్రామాల పరిశుభ్రత, మంచినీరు, ప్రభుత్వ భవనాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, గ్రామ పంచాయతీ కార్యక్రమాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియజేశారు.

గురజాల కమిషనర్‌గా శ్రీనివాసరావు



కమిషనర్‌గా శ్రీనివాసరావు

గురజాల : నగర పంచాయతీ కమిషనర్‌గా శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన కె.చిన్నయ్య సాధారణ బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లాకు బదిలీ కాగా పిడుగురాళ్ల మునిసిపల్ కార్యాలయంలో డీఈఈగా విధులు నిర్వహించిన వి.శ్రీనివాసరావు గురజాల నగర పంచాయతీ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావును పలువురు ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

తల్లీ.. ప్రణమిల్లీ..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఐదో రోజు సోమవారం అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులను కటాక్షించారు. కొన్నిచోట్ల మహాచండీగా కరుణించారు. అమ్మ దివ్యమంగళ స్వరూపాన్ని భక్తులు కనులారా వీక్షించి పులకించారు.

– రెంటచింతల/కారెంపూడి/మాచవరం/పిడుగురాళ్ల/దాచేపల్లి/మాచర్ల రూరల్



రెంటచింతల మండలం సత్రశాలలో గాయత్రీదేవిగా..



పాలువాయి జంక్షన్‌లో సంతానలక్ష్మి అలంకారం



రెంటచింతలలో సంతాన లక్ష్మీ అలంకారంలో..



రెంటచింతలలో ప్రత్యేక అలంకారంలో చౌడేశ్వరి



కారెంపూడిలో అంకాలమ్మ మహాగౌరి దేవి అలంకారం



మాచవరం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో..



చెన్నాయపాలెంలో మహిషాసురమర్ధినిగా..



పిడుగురాళ్లలో ప్రత్యేక అలంకరణలో గంగమ్మ



దాచేపల్లిలో ప్రత్యేక అలంకరణలో..



మాచర్లలో చండీదేవి అలంకరణలో అమ్మవారు



విద్యుద్దీప కాంతుల్లో కారెంపూడి అంకాలమ్మ ఆలయం



కారెంపూడిలో బతుకమ్మ పూజలో మహిళలు



అమ్మవారి దేవాలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



పిడుగురాళ్లలో ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మీ అమ్మవారు



కారెంపూడిలో అంకాలమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

ఆరోగ్య విస్తరణాధికారికి సన్మానం

క్రోసూరు: వైద్య ఆరోగ్య శాఖలో వివిధ హోదాల్లో 34 సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్‌ను క్రోసూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిరిచందన, డాక్టర్ మహమ్మద్ సాద్, డాక్టర్ ధనుష్ శాంసన్‌ను సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. హెల్త్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరి ఎన్నో ఉద్యోన్నతులు పొందిన శ్యాంసన్ వృత్తిపట్ల అంకిత భావం పనిచేశారన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు చిరపరిచితుడు, మంచి పేరు తెచ్చుకున్నవాడని అన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాంబశివరావు, ఆరోగ్యపరివేక్షకురాలు అమర జ్యోతి, స్టాఫ్ నర్స్ అంజమ్మ, వీరయ్య ఫార్మసిస్ట్ ఫాతిమా బేగం ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



శిఖాశ్యాంసన్‌ను సత్కరించిన పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

విజేతలకు బహుమతులు

మాచర్ల రూరల్ : చెస్ క్రీడ వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుందని మాచర్ల పట్టణ మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు తెలిపారు. పట్టణంలోని కిడ్స్ పాఠశాలలో సోమవారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన చెస్ పోటీల్లో విజేతల బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ పోటీలు నిర్వహించిన చెస్ అకాడమీ కోచ్ కిరణ్‌కు అభినందనలు తెలిపారు. ఎంతో మంది క్రీడాకారులకు చెస్‌లో మెలకువలు నేర్పిస్తూ క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. క్రీడల్లో రాణించిన వారికి సర్టిఫికెట్లు అందించడం అభినందనీయమన్నారు. ఐదేళ్ల బాలుడు నేషనల్ స్థాయిలో చెస్ క్రీడలో విజయం సాధించడం పల్నాడు జిల్లాకు గర్వకారణమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి చెస్ పోటీలు నిర్వహించిన నిర్వాహకులను కొనియాడారు. రిటైర్డ్ డెప్యూటీ డీఈఓ గాదె రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు యనమాల కేశవరెడ్డి, ఎంఈఓ ఎ.సురేష్, సిరి కృష్ణ జనరల్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ గుర్రం రాజశేఖరరెడ్డి, ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు కె.వి.రమణ, కిడ్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె.వి.రామకృష్ణ శాస్త్రి, రాష్ట్ర చెస్ అకాడమీ చైర్మన్ సత్యనారాయణ, ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ కె.సంజీవకుమార్, నిర్వాహకులు బి.చెంచురెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రథమస్థానం సాధించిన గోవింద్‌కు రూ.10వేలు, ద్వితీయ స్థానం గోపీనాథ్‌కు రూ.8 వేలు, మూడో విజేతకు రూ.5 వేలు నగదు బహుమతులు అందజేశారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు

మాయదారి గుంతలు



కారంపూడి రహదారిలో ఇదీ దుస్థితి



శ్రీరాంపురం రోడ్డులో పడిన పెద్ద గుంత

గురజాల నుంచి కారెంపూడి, శ్రీరాంపురం వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారాయి. ఫలితంగా ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతనెలలో కురిసిన వర్షాలకు ఇవి మరింత అధ్వానంగా మారాయి. కొన్నిసార్లు వాహనదారులు ప్రమాదాల బారిన కూడా పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

– గురజాల

రాజగోపుర శిఖర కలశ ప్రతిష్ఠోత్సవాలు



సీతారామాలయంలో రాజ గోపుర శిఖర కలశ ప్రతిష్ఠ లో కోలా సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు



సీతా రామాలయంలో రాజ గోపుర శిఖర కలశం

విజయపురిసౌత్: విజయపురిసౌత్‌లోని సీతారామాలయం రాజ గోపుర శిఖర కలశ ప్రతిష్ఠా ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. కోలా సుబ్బారెడ్డి ధర్మపత్ని నాగమ్మ కుటుంబ సభ్యుల సహకారంతో సుమారు కోటి రూపాయలు వెచ్చించి సీతారామాలయానికి రాజ గోపుర శిఖర కలశాన్ని ఏర్పాటు చేశారు. గోపుర ప్రారంభ వేడుకలను మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. 9వ తేదీ బ్రహ్మశ్రీ వేదమూర్తులు వట్టిపల్లి కృష్ణ మూర్తి ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ రాజ గోపుర శిఖర కలశ ప్రతిష్ఠ మహోత్సవం జరగనుంది. పూర్ణాహుతి, స్వామి కల్యాణం అనంతరం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రారంభ వేడుకల్లో ఆలయ అధ్యక్షులు కోలా వసంత కుమార్ రెడ్డి, కార్యదర్శి రామాంజనేయులు,కోశాధికారి సత్యనారాయణ, సత్తిబాబు, రంగారావు, అమర్ కుమార్, నరసింహమూర్తి, నాగరాజు, శివ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యసేవలు



డాక్టర్ గుర్రం రాజశేఖరరెడ్డి

మాచర్ల రూరల్: పల్నాడు ప్రాంతంలో నరాల వ్యాధులకు సంబంధించి సిరికృష్ణ జనరల్ ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ గుర్రం రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య సేవలు అందించారు. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేసినట్లు తెలిపారు. ప్రతి ఆది, సోమవారాల్లో ఆసుపత్రిలో ఉచిత వైద్య సేవలు ఉంటాయని పేర్కొన్నారు. సోమవారం 100 మందికిపైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారన్నారు. కాళ్లు రంగు మారడం, మంట, ఉబ్బడం, తదితర సమస్యలకు వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. విదేశాల్లో నిర్వహిస్తున్న చికిత్స మాచర్ల పట్టణంలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే నెలలో కూడా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మహిళల పరిరక్షణకు పటిష్టమైన చట్టాలు

సత్తెనపల్లి: మహిళల పరిరక్షణకు పటిష్టమైన చట్టాలను రూపొందించారని రిసోర్స్ పర్సన్ ఎస్కే అమీన రెహ్మాని అన్నారు. పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేధికార సంస్థ సంయుక్త నిర్వహణలోమండల న్యాయసేవాధికార కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విధాన్ సే సమాధాన్ మహిళా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. అమీన రెహ్మాని మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్‌తో కూడిన పలు మహిళా పరిరక్షణ చట్టాలను ఆమె వివరించారు. ప్యానల్ న్యాయవాది ఎస్‌బీఏ ఝాన్సీ మాట్లాడుతూ 498ఏ, ఆస్తి హక్కులు, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ముందుగా న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు సభా పరిచయం చేసి కొన్ని చట్టాలను వివరించారు. సత్తెనపల్లి ప్రభుత్వ న్యాయవాది షేక్ బాలి సైదా భ్రూణ హత్యలు, లింగనిర్ధారణ, పలు చట్టాలను వివరించారు. మున్సిపల్ మేనేజర్ ఎన్.సాంబశివరావు సమాజంలో మహిళల పాత్ర, ప్రభుత్వ పరంగా మహిళలకు అందుతున్న పలు పథకాలను వివరించారు. ప్యానల్ న్యాయవాదులు బీఎల్.కోటేశ్వర రావు, బి.అమర్‌నాయక్, గంటా వెంకటశివ, పారా లీగల్ వలంటీర్లు షేక్ సుబాని, షేక్ ఖాజా, కోట బాబురావు,షేక్ ముబారాక్, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ అమీన రెహ్మాని

సాధారణ పాలన గురించి తెలుసుకోవాలి

క్రోసూరు: స్థానిక ప్రజా ప్రతినిధులు పంచాయతీల సాధారణ పరిపాలన తెలుసుకుని ఉండాలని పంచాయతీ విస్తరణాధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ హాలులో సోమవారం ఉప సర్పంచ్‌కు, ఇద్దరు వార్డు సభ్యులు(ఒక మహిళ, ఒక పురుషుడు)కు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం జరిగింది. తొలిరోజు కోర్సు డైరెక్టర్, ఎంపీడీఓ బి.మహేష్‌బాబు, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, దొడ్లేరు పంచాయతీ కార్యదర్శి వెంకయ్య పాల్గొన్నారు. ముందుగా గాంధీజీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పించారు. శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ విధుల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 18 మంది ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు